ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.08.04.2025 సమయం. 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. హైదరాబాద్ దిల్ సుఖ్ నగర్ పేలుళ్ల కేసులో ఐదుగురు నిందితులకు జాతీయ దర్యాప్తు సంస్థ విధించిన ఉరిశిక్షను రాష్ట్ర హైకోర్టు ఈరోజు ధృవీకరించింది.
2. ప్రధానమంత్రి ముద్రా యోజన పథకం ప్రారంభమై నేడు - పదేళ్లు పూర్తయిన సందర్భంగా రుణాలు పొందిన పలువురు లబ్దిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
3. వంట గ్యాస్ సిలిండర్ ధరను 50 రూపాయలు పెంచడాన్ని BRS వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు తీవ్రంగా ఖండించారు.
4. తెలంగాణలో వచ్చే మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే నాలుగు డిగ్రీలు పెరిగే అవకాశం వుందని వాతావరణ కేంద్రం తెలిపింది.

పేలుళ్లు హైకోర్టు తీర్పు

హైదరాబాద్ దిల్ సుఖ్ నగర్ లో 2013లో జరిగిన జంట పేలుళ్ల కేసులో హై కోర్టు ఈ రోజు తీర్పు వెలువరించింది. ఈ కేసులోని.ఐదుగురు నిందితులకు ఉరిశిక్ష ఖరారు చేసింది. దోషులు తహసీన్ అక్తర్, భక్తల్, అజాబ్, అసుదుల్లా అక్తర్, రెహ్మాన్ లకు జాతీయ దర్యాప్తు సంస్థ- NIA కోర్టు ఉరిశిక్ష విధిస్తూ తీర్పు ఇవ్వడం సరైనదేనని పేర్కొంది. ఐదుగురు నిందితులకు 2016లో ఎన్ఐఏ కోర్టు ఉరిశిక్షను విధించగా, ఎన్ఐఏ కోర్టు తీర్పును రద్దు చేయాలని వారంతా హైకోర్టుకు అప్పీల్కు వెళ్లారు. ఆ ఐదుగురు నిందితులు చేసిన అప్పీళ్లను హైకోర్టు తిరస్కరించింది. ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు తీర్పును హైకోర్టు సమర్థించింది. నిందితులు అంతా ప్రస్తుతం పలు జైళ్లలో శిక్ష అనుభవిస్తున్నారు.కాగా ఈ దాడుల ప్రధాన సూత్రధారుడు రియాజ్ భత్కల్ ఇంకా పరారీలోనే ఉన్నాడు. 2013 ఫిబ్రవరి 2వ తేదీన మొదటి పేలుడు రాత్రి 7 గంటల సమయంలో మలక్పేట పోలీస్ స్టేషన్ పరిధిలోకి వచ్చే దిల్సుఖ్నగర్లోని 107 నంబరు బస్టాప్ వద్ద జరిగింది. మరికొద్ది క్షణాల వ్యవధిలో కోణార్క్ థియేటర్ సమీపంలోని ఏ-1 మిర్చి సెంటర్ వద్ద రెండో పేలుడు సంభవించింది. ఈ పేలుళ్ల దాటికి మొత్తం 18 మందిమరణించగా, 131 మంది గాయపడ్డారు.

ఎమ్.ఎస్.ఎల్

ముద్రా యోజన – వాయిస్ కాస్ట్ (ఇంట్రో)

ప్రధానమంత్రి ముద్రా యోజన ప్రారంభించి నేటికి పదేళ్లు పూర్తయింది. చిన్న వ్యాపారాలకు ఆర్థికంగా సహాయం అందించేందుకు 2015లో ఇదే రోజున ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ

పథకం ద్వారా కోట్లాది మందికి ఎలాంటి గ్యారంటీ లేకుండా రుణాలు అందజేస్తున్నారు. మరిన్ని వివరాలు...

ఎమ్.ఎస్.ఎల్

ముద్రా సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల చందుర్తి మండలం, మూడపల్లి గ్రామానికి చెందిన ముద్రా యోజన లబ్దిదారులు ఆకాశవాణితో మాట్లాడుతూ...

(బైట్స్)

పిటిసి రాజన్నసిరిసిల్ల

కె టి ఆర్

వంటగ్యాస్ సిలిండర్ ధర 50 రూపాయలు పెంచడాన్ని మాజీమంత్రి తారక రామారావు తీవ్రంగా విమర్శించారు. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుతున్నా సిలిండర్ ధర రూ.50, పెట్రోల్, డీజిల్ పై ఎక్సైజ్ డ్యూటీని కేంద్ర ప్రభుత్వం పెంచిందని ఆయన అన్నారు. ఇది బీజేపీ వాగ్దానం చేసిన అచ్చేదిన్ కు సంకేతమా? లేక మేక్ ఇన్ ఇండియా గ్రేట్ అగైన్ ప్రారంభమా? అని తారక రామారావు ప్రశ్నించారు. త్వరలో భూములకు సంబంధించి మరో భారీ కుంభకోణాన్ని బయటపెడతానని తారక రామారావు తెలిపారు. వేల కోట్ల రూపాయల ఈ కుంభకోణంలో బిజెపి ఎంపి ఒకరున్నారని ఆయన అన్నారు.

(DESK)

కవిత

తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బి.ఆర్.ఎస్ - ఎమ్.ఎల్.సి కవిత ఈరోజు దీక్ష చేపట్టారు. ధర్నా చౌక్ లో పూలే విగ్రహ సాధన దీక్ష పేరుతో కవిత చేపట్టిన ఈ దీక్షకు బి.ఆర్.ఎస్, బి.సి సంఘాల నేతలు మద్దతు తెలిపారు. ఈ సాయంత్రం 5 గంటల వరకు కవిత దీక్ష కొనసాగుతుంది.

డెస్క్

**BREAK**

ఆకాశవాణి జాతీయ వార్తలు వింటున్నారు. మరిన్ని updates కోసం హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం "ఎక్స్" handle @ air news_hyd ను ఫాలో అవండి. AIR News Hyderabad YouTube Channel ను సబ్ స్క్రైబ్ చేయండి.

పోషణ అభియాన్(షెడ్యూల్ బైట్)

గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించే లక్ష్యంతో కేంద్రం ప్రవేశపెట్టిన పోషణ అభియాన్ పథకం జగిత్యాల జిల్లాలో పూర్తి స్థాయిలో అమలు అవుతోంది. జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరేష్ ఆకాశవాణి ప్రతినిధి మహదేవ్ తో మాట్లాడుతూ, జిల్లాలోని 1065 అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించడమే కాకుండా ఈ పథకంపై మరింత అవగాహనా కల్పించేందుకు పోషణ్ పక్వాడ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

BYTE

PTC-JGL

కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలోని బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల్లో కల్తీ కల్లు తాగి 68 మంది అస్వస్థతకు గురయ్యారని బాన్‌స్వాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి తెలిపారు. వారిని బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుల్లో 13 మందిని మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, ఇద్దరు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని సబ్ కలెక్టర్ తెలిపారు. బాన్‌స్వాడ ఆస్పత్రిలో బాధితులను రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్ పరామర్శించి, వారికి ఆర్థికసాయం అందించారు. బాన్సువాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు.

(PTC-KR)

ఉష్ణోగ్రతలు

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. రానున్న మూడు రోజులలో ఉష్ణోగ్రతలు నాలుగు డిగ్రీల వరకు పెరిగే అవకాశాలు ఉన్నాయని వాతావరణ కేంద్రం తెలిపింది. కాగా, బిహార్ నుంచి ఝార్ఖండ్, ఛత్తీస్ గఢ్ మీదుగా ఉత్తర తెలంగాణ వరకు ఏర్పడిన ద్రోణి ప్రభావం వల్ల ఈరోజు, రేపు పలు జిల్లాల్లో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. నిన్న నిజామాబాద్ లో 42.5 డిగ్రీలు, ఆదిలాబాద్ లో 42.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

(DESK)

పాస్ పోర్ట్

విజయవాడలోని ప్రాంతీయ పాస్ పోర్ట్ ఆఫీస్ ఈరోజు నుంచి పూర్తి స్థాయిలో సేవలందించనుంది. కేంద్ర సహాయమంత్రి కీర్తివర్ధన్ సింగ్ పాస్ పోర్ట్ కొత్త కార్యాలయాన్ని ఈరోజు ప్రారంభించారు. ఇంతవరకు పాస్ పోర్టు ముద్రణ, జారీ కోసం వైజాగ్ పాస్ పోర్ట్ కార్యాలయానికి పంపిస్తుండగా ఇకపై ఈ ప్రక్రియను విజయవాడలోనే నిర్వహిస్తారు. దీంతో పాస్ పోర్ట్ జారీ సమయం గణనీయంగా తగ్గనుంది. తప్పుఒప్పుల సవరణ కూడా ఇకపై 3 గంటల్లోనే పూర్తి చేయనున్నారు.

(DESK)

MMTS

హైదరాబాద్ లో MMTS విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. హైదరాబాద్ నగర పరిధిలో 102.4 కి.మీ. పొడవున ఆరు మార్గాల్లో కొత్త రైల్వేలైన్లు, ఫలక్ నుమా- ఉందానగర్ వంటి ప్రాంతాల్లో డబ్లింగ్ నిర్మాణాలను చేపడుతున్నట్లు రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ ఇటీవల పార్లమెంట్లో చెప్పారు. రూ. 1,169 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులు చేపడతారు.

(DESK)

ప్రత్యేక రైళ్లు.

వేసవిలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. చర్లపల్లి నుంచి తిరుపతికి శుక్ర, ఆదివారాల్లో రాత్రి 9 గంటల 35 నిమిషాలకి ప్రత్యేక ట్రైన్ బయలు దేరనుండగా.. శని, సోమ వారాల్లో సాయంత్రం 4 గంటల 35

నిమిషాలకి తిరుపతి నుంచి చర్లపల్లికి ప్రత్యేక రైలు బయలుదేరుతుంది. ఏప్రిల్, మే నెలల్లో మాత్రమే ఈ ప్రత్యేక రైలు సేవలు అందుబాటులో ఉంటాయి.

(PN)

**ఎండ్**

ఆకాశవాణి ప్రాంతీయ వార్తలు ఇంతటితో సమాప్తం. తిరిగి సాయంత్రం 6 గంటల 10 నిమిషాలకు ప్రాంతీయ వార్తలు వింటారు.